# జోలపాట

ఎండిన బీడుభూముల మీదుగా బయలు దేరిన గాలి ఎండిన పడియల్లో నీరు తాగేందుకు అక్కడ ఒక్క క్షణం ఆగి తాగేందుకు అక్కడ ఏమీ లేకపోతే పిచ్చితో రెచ్చిపోయి అస్థిపంజరాల్లా ఉన్న పూరికొంపల మీదికి పరుగెత్తింది, పల్లె మధ్యనున్న మేడలవైపు పోవటానికి భయపడి అత్తమీదున్న కోపాన్ని దుత్తమీద చూపించినట్లు. పల్లెకు దక్షిణం నుండి బయలు దేరిన గాలి ఆదిశగా పల్లెకు చివర ఉన్న ఒకటే ఒకటైన బావిలోకి దాహంతో నీరు తాగేందుకు తొంగిచూచి అట్టడుగున చందమామలా ఉన్న నీటిని చూచి పిచ్చికోపంతో ఎఱ్ఱమట్టినేలను ఢీకొని, గిఱ్ఱున తిరుగుతూ పైకిపోయి, కోపంతీరక ఎమడమవైపుగా పల్లెను చుట్టి ఉత్తరానున్న శ్మశాన భూమిలోపడి, మూడురోజుల క్రితమో మరెప్పుడో కాలి బూడిదై పొగులుపడ్డ తెల్లని గుట్టల మీదికి దూసుకుపోయింది ఊరిమధ్యన రాయడుగారి బావివంక పోయేందుకు సాహసంలేక.

నిప్పులు కక్కే సూర్యుడు పల్లెనెత్తి మీదకొచ్చి, నాయుడుగారి తోట మధ్యమన్న మేడవేపు చూడలేక తన ప్రతాపాన్నంతా బట్టలులేని పొరగాళ్ళ శరీరాల్లా ఉన్న గడ్డికొంపల మీద చూపిస్తున్నాడు. దాహంతో అలమటిస్తున్న గాలి ఎండి పోయిన గొంతుకతో ఆకాశంలోని మేఘాల రాకకై చూస్తూ భూమిమీద చినుకు పడకముందే తాగేయాలన్న పిచ్చి భ్రాంతితో పైకిపోతూ ఊరిచుట్టూ తిరుగుతోంది. నీరసపడిన గాలి కదల్లేక భూమిమీదే పడి ఉంది కంకరరాళ్ళ ఒడిలో, ఎఱ్ఱమట్టి పొరల్లో. నాయుడు గారి తోటలో కదిలేచల్లగాలి తోట దాటిపోలేక మండిపడే సూర్యుని చూచి బిక్కచచ్చి పోయి మేడపైనే షికారుచేస్తోంది.

ఒంటినిండా ఆరని చమట. వీధిలో అగ్గిగుండం. అప్పుడప్పుడు రెచ్చిపోయే పిచ్చిగాలి నోరార్చుకు పోతూంటే: అయిదోసారి మట్టికుండలోని నీరు వంచుకుని తాగాడు నారాయణరావు. చాపమీద మరోసారి మేనువాల్చి బూజులు వేలాడుతున్న మిద్దెవేపు చూశాడు. నిద్రపోదా మని బలవంతంగా కళ్ళు మూసుకున్నాడు. కాని రెండు గంటలనుండి రాని నిద్దుర ససేమిరా కళ్ళమీదకు రానంది. కళ్ళు మత్తుగా మూసుకుని, మగతనిద్రపోతూ హాయిగా రాజేశ్వరిని కలల్లోకి ఆహ్వానించి తృప్తితీరా కౌగలించుకొని, తనిది తీరా కబుర్లాడుకుని కాలంగడపాలని శతవిధాల ప్రయత్నం చేస్తున్నాడు నారాయణరావు. తోటదగ్గర ఆమె చూసిన చూపు, మేడపైనుండి ఆమె నవ్విన నవ్వు నారాయణరావుకు మరపుకు రావు. 'రాజేశ్వరీ' పైకన్నట్టుగా మనసులో అనుకున్నాడు.

చుంచెలుక అంటగిన్నెలమీదుగా దాడి చేస్తూ చప్పుడు చేసింది. నారాయణరావు ఒక్క ఉదుటున లేచి చాపమీదే కూర్చుని ఆ గదిలోకి చూశాడు. ఇత్తడిగిన్నె, దానిమీద స్టీలుమూత, ఆ మూతని తొలగించాలని దాని ప్రయత్నం. ఆ గిన్నెలో ఏమీలేదు. పైన ఊరకే మూతపడేశాడు. అందులో ఏదో ఉందనుకుని బాధపడుతోంది పాపం. లేచి వెళ్ళడానికి బద్దక మేసిందతనికి. కొద్దిగా ముందుకు

జరిగి కాలితో తలుపును దగ్గరకు తోశాడు. ఎలుక బెదిరి పారిపోయింది.

మళ్ళా చాపమీదకు చేరాడు. "రాజేశ్వరీ: నువ్వెంత అందంగా వున్నావు. నీ నవ్వేచాలు. కోటి రతనాల పొత్తుకి. నా మీద అంత మనసులేందే అంతగా, అంత తియ్యగ, ఎంతో మత్తుగ ఎందుకు చూస్తావు".

తలుపు సందుల్లోంచి. కిటికీలోంచి వేడి సెగలు దాడిచేస్తున్నాయి. విసుగ్గా నారాయణరావు రిష్టువాచీ చూచుకొన్నాడు. ఒంటిగంట కావస్తోంది. 'సాయంత్రం అయిదుగంటల వరకు కదల్నీయదురా బాబూ ఈ ఎండ. అయి ద్దాటగానే చక్కగా ముస్తాబై తోటదగ్గర చేరాలి. రాజేశ్వరిని చూడాలి.'

ఒక్కసారి వడగాలి సుడిగాలిలా ఇంటిలోకి చొరబడింది. తలుపులు ఒక్కసారి బార్లా తెరచుకున్నాయి. ఒక్క ఉదుటన లేచి కూర్చున్నాడు. గాలి సుడులు తిరుగుతూ అమ్మోరిముందు గణాచారిలా చిందులు తొక్కుతూ ప్రక్కనున్న గోర్జాలోకి చొరబడింది. తలుపు దగ్గరేసి పడుకోబోతూ ఎదురింటివైపు చూశాడు.

ఎదురింటి వీధి గడపలో అదెమ్మ కూతురు గుంజకు అనుకుని కూర్చుని మూడు నాలుగు అతుకులుపడ్డ తాటితో గుడ్డ ఉయ్యాల నూపుతూ ఒక్కొక్కప్పుడు మెల్లగా, మరోసారి గట్టిగా గొంతుక పెంచి జోలపాట పాడుతోంది. ఈ పాటని ఆ పిల్ల ఎన్ని గంటలకు మొదలు పెట్టిందో తెలియదు. అంతులేకుండా సాగుతూనే ఉంది. అది నారాయణరావు చెవులకు మరింత దగ్గరగా వినిపిస్తోంది.

"సిట్టీ పాపా....సిన్నా పాపా... జో.... జో.... పాపా.... ఆ.... ఆ.... పాపా...." రెండుకాళ్ళు బారజాపుకుని కూర్చొని పాడుతోంది పాట. ఉయ్యాల్లో అదెమ్మ రెండో కూతురుంది. దానికి ఏడెనిమిది నెలల వయసుంటుంది. ఈ పిల్లపుట్టిన తరువాతే అదెమ్మ మొగుడు పోయాడు. సంవత్సరం నుండి ఆ ఇంటిలో ఉన్న నారాయణరావుకే వివరాలన్నీ తెలుసు. దిక్కు మొక్కులేక పిల్లల బరువు మోసే అదెమ్మంటే జాలి. ఆమె అమాయకత్వానికి బాధపడుతూంటాడు. ఎప్పుడైనా పావలానో పదిపైసలో ఆమె చేతిలో పెట్టాలని ఉంటుంది. ఎవరికైనా తెలిస్తే ఏమనుకుంటారో అని భయం. ఊరకనే యిస్తే ఆమేమనుకుంటుందో అని సంశయం, అందుకనే ఆమె చేతిలో ఏమీ పెట్టలేకపోయాడు. ఆమె కూడ ఎప్పుడూ ఏమీ అతడి నడగలే.

నారాయణరావును చూచి ఆ పిల్లతన గొంతు మరీ పెంచి పాడుతూ అతన్ని చూడనట్టు ముఖం తిప్పుకుంది, తాడును ముందుకు వెనక్కి పొనిస్తూ. నారాయణరావుకు విసుగేసింది.

"కొండా: ఓసె కొండా: ఇట్రా:" గట్టిగా అరిచి పిలిచాడు. తాడును వదిలేసి పరుగెత్తుకుని వచ్చి గుమ్మం అవతల విలబడింది పొడుగైన నైలాన్ పరికిణీని రెండు చేతులతో ఎత్తిపట్టుకుని, చిరుగులు పట్టి మాసిపోయి, నలిగిపోయిన ఆ పరికిణీతో పాటు చమటకంపు అతని గదిలోకి చొరబడింది. అది లోపలికి అడుగు పెడుతుందేమోనని: 'అవతల నిలబడు:' అని ఆజ్ఞాపారేసి దిండు మీద మోచేతుల

నుంచి బోరగిల్ల పడుకున్నాడు. అది అవతలే నిలబడింది.

"ఎందుకేగొంతు చించుకుని అరుస్తున్నావలా చెవిటికాకి లాగ: గంటనుండి చూస్తున్నాను. పడు కోనియ్యవా ఏమిటి:" కేకలేశాడు, చింత నిప్పల్లా ఉన్న దాని కళ్ళను చూస్తూ.

"మా సెల్లికి జోలపాడ్తన్నా". అంది. ఎండకి దాని ముఖం వాడింది.

"ఉద్ధరించావు. నీవలా గట్టిగా అరుస్తూంటే అదెలా పడుకుంటుందే, మాటగాని." బోధపరచే పద్ధతిలో అన్నాడు. అది బిక్క ముఖం వేసి నిలబడి పోయింది.

"అయినా మీ యమ్మేది?"

"నాయుడుగారింటి కెల్లింది. రేపు రేత్రి ఆరింటో లగ్గం కదా. అందికే. నిన్నా ఎల్లింది, రేపూ ఎల్తాది"

కొండమ్మ మాటలు వినిపించటం లేదు. 'కొంపతీసి రాజేశ్వరికి కాదుగదా పెళ్ళి: గాబరాపడ్డాడు నారాయణరావు. "ఎవరికే పెళ్ళి?" కంగారుగా అడిగాడు లేచి కూర్చుంటూ. "ఆ రబ్బాయికే. మీసాల బాబంతారు సూడు, అయనికే లగ్గవు. రేపు రేత్రే." ఉయ్యాల్లో అదెమ్మ కూతురు, కయ్యిమంది.

"ఎందుకలా ఏడుస్తుంది: ఇందాకట్నుంచి చూస్తున్నాను" అడిగాడు.

"దానికి ఊట్టవు...ఇరోసనాలు."

"మరైతే వీధిలో పడుక్కోపెట్టేవేం: లోపలికి తీసికోపో. ఎండెలా ఉందో చూశావా:"

"లోన ఉయ్యాల్లేదు. మా యమ్మ వస్తాది. కూడు తెస్తాది."

ఉయ్యాల్లో అదెమ్మ కూతురు గుక్క పట్టింది.

"మీ యమ్మ పాలిచ్చి వెళ్ళలేదే:"

"మా యమ్మకాడ నేవ్వుబావూ:... బావూ: కాసిని.... మంచినీల్లిత్తవా:"

సమాధానంగా నారాయణరావు చాప మీంచిలేచాడు. స్టీలుగ్లాసుతో కుండ లోంచి చల్లటి నీళ్లిచ్చాడు.

"ఏంచేస్తావీ నీళ్ళు"? అడుగుతూ.

"మా సెల్లికి పడ్త. నేపోతే నోరెండిపోద్ది బావూ:"

ఆరేళ్ళ పిల్లకి అన్ని తెలివితేట లున్నందు సంతోషించాడు నారాయణరావు.

చెల్లిచేత మంచినీళ్ళు తాగించి గ్లాసు తెచ్చి ఇచ్చింది కడిగి కొండమ్మ.

"మందేవన్నా వేశారే చెల్లికి:" అది వెళ్ళబోతూంటే అడిగాడు.

"ఈ పొద్దు ఈ రాసారి బావు మందిచ్చినడు. సందేలమల్లస్తడు" అంది.

"నెమ్మదిగా పాడుకో". అంటూ దాన్ని పంపేసి అరుగుమీదికొచ్చి నిలబడ్డాడు. వీధివీధంతా నిర్మానుష్యంగా ఉంది. ఎండ నిప్పులు చెరుగుకోంది.ఎండవైపు చూస్తుంటే

కళ్ళు భగ్గు మన్నాయి. ఎదురింటివైపు చూశాడు. కొండమ్మ నిలబడి ఉయ్యాలూపుతోంది. అంచేత దాని ముఖం కనపడలేదు. ఏదో తట్టింది. దాని కేదో చెప్పాలనుకున్నాడు. వంగి దాన్ని పిలవాలనుకునేంతలో వంటింటిలో ఇత్తడి గిన్నెమీద స్టీలు మూత ధ్వని. వంటింటిలోకి పరుగెత్తాడు. అతడ్ని చూచి చుంచెలుక కలుగులోకి పారిపోయింది.

ముఖం మీద రెండు చెంబుల నీళ్ళు దిమ్మరించుకుని, తువ్వాల్ని తడిపి, ముఖంమీ దేసికుని వీధి తలుపులు దగ్గర కేసి చాపమీదకు చేరాడు.

'రాజేశ్వరికి పెళ్ళని ఎంత భయపడ్డాడు అవును. నిజమే. వారంరోజుల క్రితం సమితాఫీసు దగ్గర విన్నాడు. నాయుడిగారి పెద్దబ్బాయికి పెళ్ళని. తను అతడ్ని రెండుమూడుసార్లు చూశాడు కూడ. చాకులాంటి కుర్రాడు. పెళ్ళం కూడ డాక్టరేనట. ఇద్దరూ కలసి పట్నంలో ప్రాక్టీసు పెడ్తారట. ఈ పల్లెటూర్లో మాత్రం ఎవరూ ప్రాక్టీసుపెట్టరు. ఏం గిట్టుబాటవుతుందని. ఇవిలా ఉండ వలసిందే. ప్రతీ పల్లెటూర్లో ఒక్కొక్క హాస్పిటలు పెడితే...' నవ్వొచ్చిందతనికి. ఇప్పటికే ముప్ఫయిమంది పిల్లలు కూడా రానీఊర్లో ఎలిమెంటరీ స్కూలు పెట్టినందుకు, ఇలాంటి దిక్కుమాలిన ఊరిలో తన్ను సింగిల్ టీచర్‌గా వేసినందుకు ప్రభుత్వాన్ని తిడుతున్నాడు. ఇంకానా ఎప్పుడీ ఊరు నుండి విముక్తి దొరుకుతుందో ఏమిటో, అనుకున్నాడేగాని ఒక్కసారి మనస్సు గతుక్కుమంది.

''అమ్మో: రాజేశ్వరిని విడిచి వెళ్ళి పోవడమే: వద్దు.... వద్దు... ఊరికి వచ్చిన సంవత్సరం నుండి చూస్తున్నాడామెని. రెండుమూడుసార్లు మాటాడేశాడు కూడ. మాటాడిన ఒక్కముక్కైనా ఎంత తియ్యగా ఉంటుంది. తియ్యగా చూస్తుంది. మల్లెపువ్వులా నవ్వుతుంది. దంతపుబొమ్మలా .... అజంతా సుందరిలా... ఏమిటి తింటుదో, సన్నటి పొడవైన నాజూకు చేతి వ్రేళ్ళు... ఎరుపు, నీలం రాళ్ళ ఉంగరాలు.... పొడవైన అందమైన మెడ.... అసలు డబ్బున్న వాళ్ళే అందంగా పుడతారు కాబోలు... ... ... ... ... ... ... ... ... ... ''వరికూడు వండతాదే... పాపా... వంకాయి వండతాదే... పాపా... సిన్నీపాపా... జో... జో... పాపా...''

ఈ పొద్దెల్లి ఆ పొద్దొత్తావూ ... సెందురూడా ... ... మా సిన్నిపాపకి తెయ్యే... ... శామంతి పూలూ... సందమావా... జో... జో... పాపా... ఆ... ఆ... పాపా...

'ఎందికే అనాగేడుత్తావు: ... ఊరు కొయ్యే ... అమ్మొత్తాది... నాయుడుగారింటి కెల్నాది... ఊరు కొయ్యే ... పప్పులు... బూర్లు... గార్లు... తెత్తాదే... మా యమ్మకాదే...

సిన్నిపాపా... జో జో...పాపా... సిన్ని... పాపా...

''ఒలే సెల్లీ ...ఏరుసెనగమ్మ పాట పాడ్తనే... సల్లంగ తొంగేయే... అమ్మ ముందు నీకే తెత్తాదే... ఊరు కొయ్యే...''

''నీ... ఈరకాడు ఇజయనగరం ఏరు సెనగమ్మా.

నీ జాదవది జాడుపూడు ఏరు సెనగమ్మ.

నీవు పుట్టినావు పూడొలస ఏరుసెనగమ్మా .

నీవు పెరిగినావు పెనుగొండ ఏరు సెనగమ్మా...

సాలే... ఇంకా పొద్దునూరుకోయే ... ఊరుకో...

గనమైన పిక్కలమ్మ ఏరుసెనగమ్మ.

గడ్డిళ్ళు పోయినాయి ఏరుసెనగమ్మా.

ఊరుకొయ్యే... పాపా... సిన్నీపాపా... జో... జో... పాపా..."

ఎన్ని రకాలుగా సముదాయించాలని చూస్తున్నా పాప ఊరుకోవటంలేదు. గుక్కపెట్టి ఏడుస్తోంది.కొండమ్మ ఊరుకోటంలేదు.ఏదో పాట పాడుతూనే ఉంది.

నారాయణరావుకి మాత్రం విసుగ్గా ఉంది వీధిలో కొండమ్మ పాట, పిల్ల ఏడువు, పెరటిలో చుంచెలుక రణగొణ ధ్వని. ఇంటిలో అగ్గిగుండం.

విసుగ్గా చాపమీంచి లేచాడు. తలుపు తెరిచాడు. కొండమ్మ ముకం కనపడటం లేదు. కొండమ్మ నిలబడి ఊపుతోంది. ఎండిపోయిన తువ్వాల్ని భుజంమీద వేసికుని అగ్గిగుండంలోంచి రెండడుగుల్లో అదెమ్మ అరుగుదగ్గరి కెళ్ళాడు. అతన్ని చూచి కొండమ్మ గొంతు నొక్కుకుంది.

"నీ కిందాక చెప్పలే: ఎందుకలా గొంతు చించుకుంటావు"? విసుగ్గా అడిగాడు మోకాళ్ళమీద రెండు చేతులుంచి వంగి నిలబడి.

"ఈ జెష్ట ఏడుత్తా ఉంటే... నానేటి సెయ్యను బావూ..."?

నారాయణరావు ముక్కుకి ఒక్కసారి ఉచ్ఛ్వాసన కొట్టింది. "ఏడవదూ: దాని పక్కబట్టలన్నీ పాడయ్యాయి. బట్టలు మార్చు, పడుకుంటుంది." కొండమ్మ ఉయ్యాల్లోకి తొంగిచూసింది.

"సెల్లిని కసింత పట్టుకుంతవా?" అడిగింది. ఉయ్యాల వంక చూశాడు. ఒక చీరపాతను తడిపి ఉయ్యాల చుట్టూ కట్టింది కొండమ్మ. అయిష్టంగా తల దగ్గరికి కదిలి పాపను తియ్యబోయాడు. అతనికి పసిపిల్లల నెత్తుకోటంలో అసలు అలవాటు లేదు. నెమ్మదిగా ఉయ్యాలలోంచి కిందికి దించాడు...పడుకున్న బట్టలన్నీ ముదురు పసుపురంగుతో వాసనకొడుతున్నాయి. కొండమ్మ నారాయణరావు ముఖంలో విసుగును గమనిస్తూనే ఆ బట్టలతోనే పిల్ల ఒళ్ళంతా తుడిచింది. వేడిసెగలు కక్కుతున్న ఆ శరీరాన్ని పట్టుకోవటంచేత నారాయణరావు చేతులు కూడ వేడెక్కిపోయాయి.

"జ్వరం చాల ఎక్కువగా ఉంది". గొణుగుతున్నట్టు అన్నాడు. కొండమ్మ ఒక్కసారి అతనివైపు చూసి మౌనంగా ఉయ్యాల గుడ్డకూడ తుడిచింది.

"మరేదైనా గుడ్డ పరువు". అన్నాడు. కొండమ్మ ఇంటిలోకి వెళ్ళి ఒట్టిచేతులతో తిరిగివచ్చింది. నారాయణరావు చేతిలో పాప మూసిన కళ్ళు తెరవక తోటకూర కాడలాగ వాలిపోతోంది ప్రక్కకి.

"గుడ్డ లెవ్వి లెవ్వు". అంటూ తను కట్టుకున్న పరికిణీ విప్పేసి రెండుమూడు

మడతలు పెట్టబోయింది. లోపల చిరుగుల మాసిన లాగు.

"ఆ లంగా కట్టుకో. ఇది పరువు". అంటూ నెమ్మదిగా భుజం మీది తువ్వాల్ని నేలమీదికి జార్చాడు.

"వద్దు... బావూ..."

"ఫరవాలేదు... ఇది పాతదే..."

కొండమ్మ మారుమాటాడక తువ్వాల్ని ఉయ్యాల్లో పరిచింది: మడతలు వేసి. నారాయణరావు ఉయ్యాల్లో పడుకో పెట్టాడు.

"కొండా :...మీ సెల్లిని నే చూస్తా. మీ యమ్మని పిలుచుకొచ్చీ."

"వస్తాది బావూ : తిండి తినంగానే- వస్తాది."

"పోనీ ఈ చుట్టుపక్కల ఎవరినైనా పిలుపు."

"ఎవరూ నేరు బావూ...? అందరూ నాయుడిగారింటికాడ పనికెల్నారు కద..." చీరపాతను తడిపి ఉయ్యాల చుట్టూ కట్టి అంది.

పాప ఒంటిమీద చెయ్యి వేసి చూశాడు. చెయ్యి చుఱ్ఱు మంది.

నారాయణరావుకి వింతైన ఆలోచన పచ్చింది. గబగబా ఇంటిలోకి పోయాడు. ముఖం తుడుచుకుని, లుంగీమీదే కల్లీ లాల్చీవేసి ఇంటికి తాళంవేసి మారు మాటాడకండా నాయుడిగారింటే వైపు పరుగెత్తాడు: పెద్ద పెద్ద అంగలతో. నాయుడుగారి మేడదగ్గరకొచ్చేసరికి అతని వేగం తగ్గిపోయింది. గుండె దడదడ కొట్టుకుంది. లుంగీతో ముఖం తుడుచు కున్నాడు. రాజేశ్వరికోసం నలువైపులా పరికిస్తూ ఇంటిముందు పెళ్ళిపందిల్లోకి అడుగు పెట్టాడు. పనివాళ్ళు పందిర్లో అలంకరణలు చేస్తున్నారు, అదెమ్మ ఎక్కడా కనపడలేదు. అంత చురుకుగా రాజేశ్వరికోసం చూస్తున్నాడు.

"ఎవరుకావాలి బాబూ:" వాలుకుర్చీలో ఒక ముసలాయ నడిగాడు.

రాజేశ్వరి కావాలి అని అడగబోయి: తమాయించుకుని "డాక్టరుగారు కావాలి:" అన్నాడు.

"ఎవరు: రాంబాబా: ఎందుకు బాబూ?"

"పేషెంటును చూడాలండి."

"ఇవ్వాళే పెళ్ళికొడుకును చేశాం కదా ఇల్లు కదలకూడదు. అయినా వాడి ప్రాక్టీసంతా టౌన్‌లోనే, ఇక్కడ వాడి దగ్గర మందులేనీ ఉండవు."

"పోనీ పాపను తీసుకొస్తాను చూస్తారేమో:... పాపకి జ్వరం..."

"వాడు పడుకున్నాడు, ఇప్పుడల్లా లేవడు..."

"పాపకి జ్వరం బాబూ:"

"జ్వరమేమిటయ్యా: ఎండవేడికి అందరి శరీరాలు కాలిపోతూంటే ... నోరార్చుకుపోతూంటే..."

నారాయణరావుకి ఏం మాటాడాలో తెలియలేదు.

రాజేశ్వరి కోసం చూశాడు. ఆమెతో చెప్తే ఆమె అన్నగారికి చెప్తుంది. కాని ఆమె ఎక్కడా కన్పించలేదు.

'రేపురాత్రి పదకొండున్న రకిలగ్నం. మధ్యాహ్నం భోజనానికి రాత్రి పెళ్ళికి వచ్చేయండి'' అన్నాడు ఆరిపోయిన చుట్టను వెలిగిస్తూ ''అలాగే'' అన్నాడు వినిపించనంత మెల్లగా.

వెను తిరిగాడు. కాని కాలు ముందుకు పడటంలేదు. పెరటివైపు నెమ్మదిగా వెళ్ళాడు. విశాలమైన పెరట్లో పనివాళ్ళు ఆడ, మగ. పెరటి గుమ్మం దగ్గర నిలబడి లోపలికి అదెమ్మకోసం తొంగి చూశాడు. అదెమ్మ ఎక్కడా కనపడలేదు. రాజేశ్వరీ కనపడలేదు.

''ఎవరు కావాలి?'' ఎవరో అడిగారు. నలువైపులా చూశాడు. అడిగినవారెవరూ కనపడలే. మళ్ళా ప్రశ్న. ఈసారి తల ఎత్తి చూశాడు, మేడమీద నుండి గుమ్మడి పండులాంటి శరీరాన్ని గదిలోకి చేరవేయ బోతూ మెడలోని కాసులదండ బరువుకి మెడ ఒకసారి వెనక్కి వంచి అడుగు తోంది ఒక నడివయస్సామె.

''అదెమ్మ:.... ఆమె కూతురికి జ్వరం...''

''అట్టాగా... చూడబ్బాయి... అలా పోయేటప్పుడు మంత్రి సీతిగాడ్ని ఓసారి సాయంత్రం రమ్మన్నానని చెప్పు...''

''అదెమ్మ...'' మళ్ళా అన్నాడు, ''అలాగే... కబురు మాత్రం చెప్పు'' అంటూ కదిలిందావిడ. నారాయణరావు గుండె భగ్గుమంది. ''నేనేం ఈవిడగారి నౌకర్నా''. అసహ్యంతో వెనుతిరిగాడు.

తిరిగొచ్చేసరికి పాప నిద్రపోతోంది, ఏడవటంలేదు.

ఒంటి మీద చెయ్యేసి చూశాడు, మునుపంత మరిగిపోవటం లేదు. కొండమ్మనెమ్మదిగాసన్నగా పోడుతోంది, ''మాయమ్మ వస్తన్నదా:'' అడిగింది పాటాపి.

''చెప్పాను, వస్తుంది. జ్వరం తగ్గుతోంది. మరి పెద్దగొంతు పెట్టి దాన్ని లేపకు, నిద్రపోనీ''. అన్నాడు.

తలూపింది కొండమ్మ.

పెదవులు, గొంతు తడారిపోయాయి.

ఇంటితలుపు తెరిచి, రెండు గ్లాసుల నీళ్ళుతాగాడు. నాయుడుగారింటికి వెళ్ళిన అతనికి అన్ని రకాలుగా అసంతృప్తిగా ఉంది. డాక్టరునే తేలేకపోయాడు. అదెమ్మకు కబురు చెప్పలేకపోయాడు. రాజేశ్వరిని చూడలేకపోయాడు.

మధ్య గదిలోకి వచ్చాడు. చుంచెలుక ఇంకామూత తొలిగించాలనే బాధపడుతోంది. కాసేపు చాపమీద నడుమువాల్చి రాజేశ్వరి గురించి తీయగా ఆలోంచించవచ్చు అనుకున్నాడు. బట్టలు మార్చకుండా నేచాపమీదకు చేరాడు, ...'రాజేశ్వరి తన్ను చూచిందా... చూచే ఉంటుంది... తనగొంతు విన్నదిగా ...తన

గొంతు తనకి బాగా పరిచయమే. ఉదయం వేళలో... ఎప్పుడైనా శివాలయా నికెళ్తూ బడిలోకి తొంగిటూడటం తాను చాలాసార్లు చూశాడు. ఒకసారి 'ఇది మీ నాన్నగారు కట్టించిన బడే, రండి లోపలికి' అన్నాడు.

''వాళ్ళు బుద్ధిగా చదువుకుంటున్నారు. మీరు బాగా పాఠాలు చెప్తున్నారు, చెప్పండి'' అంటూ వెళ్ళిపోయింది. ఆ రోజంతా ఎంత ఆనందంగా గడిచిందని. అలా ప్రతీరోజు ఆమె వస్తే బాగుండు ననుకున్నాడు. ఆమె అటు వెళ్ళేదిగాని ఆమెను పలుకరించాలంటే ఏదో జంకు. ఆ మేడమీద నుండి పలుకరించిన దెవరు:

ఆమె తల్లా అయ్యుండదు, అమలా కఠినంగా మాటాడదు,... కఠినంగా ఏం అందని? కబురొకటి చెప్పమంది'' తానెవరో తెలియక. తరువాత రాజేశ్వరి చీవాట్లు పెట్టిఉంటుంది. పాపం ఆమె ఏ అవసరంమీద కబురుచెప్పమందో:... ఒకసారి మంత్రి ఇంటికెళ్లి కబురు చెప్పేస్తే... నిజమే రాజేశ్వరి కూడా సంతోషిస్తుంది. ఎంత నిరాడంబరమనిమెచ్చు కుంటుంది. వీరాచారి ఇంటికి కూడా అదే దారి . ముందతన్ని కలిసి ఒకసారి రమ్మనిచెప్పి అటు వెళ్లొచ్చు.

వెంటనే లేచాడు. తలుపుకు తాళం వేశాడు. కొండమ్మ ఇంకా జోలపాట పాడుతూనే ఉంది. ఆ దెమ్మ ఇంకా రాలేదు. నారాయణరావు ఉయ్యాల్లోకి తొంగిచూశాడు. పాప నిద్రపోతోంది. ఒంటిమీద చెయ్యి వేస్తే లేచిపోతుందేమో అని తృప్తిగా పాపవైపు చూచి వీరాచారి ఇంటివైపు దారితీశాడు.

కొండమ్మ కూర్చుని సన్నగా పాడుతోంది. ఆ పాట అతనికి వీధి చివరి వరకు వినిపిస్తూనే ఉంది.

సిట్టి పాపా:... సిన్నా పాపా: జో:... జో:... పాపా:... ఎన్నాపూసా...అమ్మేస్తాదే సంతలోన... సవకే సెల్లీ. సిట్టీపాపా... సిన్నా... పాపా... ముందు కెడుతున్న నారాయణరావు కాళ్ళకు సంకెళ్ళు పడ్డాయి. ఉదయం నుండి అలా పాపం చెల్లికోసం తాపత్రయ పడుతోంది. తిండి తిన్నదో లేదో, రాత్రి భోజనం కోసం దాచుకున్న ఆ రెండు మెతుకులు ఆ పిల్లకి పెడితే. వెను తిరగబోయాడు. అంతలో ఎదురుగా వీరాచారి.

''మీ కోసమే వస్తున్నాను'' అన్నాడు.

''ఎందుకు''?

''అదెమ్మ కూతురికి జ్వరం... ఒక్కసారి...''

''అదెమ్మ లేదా''?

''నాయుడిగారింట్లో ఉంది. ఇక్కడ పాప...''

''ఈ పక్క రామాలయం దగ్గర సూరిబాబుగారింటి కెళ్ళి వస్తా... మీ రెలాగా బయలుదేరారుగా. ఆదెమ్మకి కబురుచెప్పి రమ్మనండి. ఈ సమయంలో తల్లి దగ్గరుంటే మంచిదిగా''... అన్నాడు. నారాయణరావుకి నిజమే అనిపించింది. పాప చచ్చిపోతుందేమో అని కూడా భయం వేసింది. నాయుడిగారింటివైపు దారి తిప్పాడు. సరాసరి పెరటివేపు వెళ్ళాడు. బావి దగ్గర అదెమ్మ అంట్లు గుండిగలు తోముతోంది. ఇంకా నలుగు రైదుగురు ఆడవాళ్ళు, ఇద్దరు మొగాళ్ళు నీళ్ళు చేదుతున్నారు.

అయిదారు నిముషాలు అగాడు.

నారాయణరావు దృష్టి రాజేశ్వరిమీద లేదు. సరాసరి అదెమ్మవైపు నడిచాడు. అదెమ్మ అతన్ని చూచింది. అంట్లచేత్తోలేచి నిలబడింది.

"అదెమ్మా: నీ కూతురు జ్వరంతో అలా మూలుగుతోంది కదా:... ఒక్కసారి చూచి దానికేంకావాలో చూడ కూడదూ!" మందలిస్తున్నట్టన్నాడు.

"పనైతేగాని ఒదల్రు బాబూ: నానేటి సెయ్యను?" అంది మసి చేతుల్ని గాలిలో తిప్పతూ.

"కాని ఆ పసిదాని కే మైనా అయితే..."

"ఏటి బాబూ... ఏటి బాబూ..." కంగారుపడింది.

"నీ పాపకేం భయంలేదు. వీరాచారికి చెప్పాను,వచ్చి చూస్తాడు,నీవూ పద."

మసిచేతుల్ని సగం కడిగి కడగక ఇంటిలోకి పోయింది, ఎవరితోనో ఏదో చెప్తోంది. కొద్దిగా ముందు కెళ్ళాడు రాజేశ్వరి కనిపిస్తుందేమోనని.

"....చాలు చాల్లే... సంబరం... మా పనులంటేనే మీ కెక్కడలేని సంకటం... పని పూర్తి చేసే వెళ్ళు... మీకు రోగాల్రావు... రొస్టులు రావు... ఆ చావులన్నీ మాకే వెళ్ళు ..... వెళ్ళు గిన్నెలన్నీ లెక్కపెట్టి మరీ వెళ్లు" నారాయణరావు గుండె నీరయింది.

ఎవరో ఆ మాటలంటే క్షమించేవాడే, కాని ఈమె మాత్రం క్షమార్హురాలుకాదు.

మనసు ఒక్కసారి శూన్యమై పోయింది ఇత్త డిగిన్నెమీద మూత నేల మీద పడ్డది.

ఇప్పుడాతనికి ఎవరినీ చూడాలని లేదు. గిరక్కున తిరిగాడు.

అదెమ్మ అమ్మగారికేం చెప్పుకుందో, బాణంలా ఇంటివైపు దూసుకుపోయింది. 'నా కూతురో... నా కూతురో...' అని గుండెలు బాదుకుంటూ.

అతని గుండెలో ఎందుకో ఆరాటం. అడుగులు త్వరగా పడటంలేదు. వీధి మొగలు కొచ్చాడు. అదెమ్మ గుండెలు బాదుకు ఏడుస్తోంది. అతని గుండెలు రక్తం చల్లబడింది. 'పాపకేమయింది?.'

"ఈ ఎండకు, వడగాలికి, కన్ను మూయలేదు కదా" ఆలోచిస్తూనే యాం త్రికంగా అదెమ్మ ఇంటిముందు చేరాడు.

వీరాచారి ఇంజక్షన్ సిరంజి క్లీన్ చేసికుని బ్యాగులో సర్దుకుంటున్నాడు.

అదెమ్మ భుజంమీద కుడిచేతిలో పాప. ఆమె నుండి మందువాసన. పాప గుక్కపట్టి ఏడుస్తోంది. ఆ పాప ఏడుపును కూడ పట్టించుకోకుండ అదెమ్మ కొండమీదపడి ఏడిస్తోంది.

కొండమ్మ చేతిలో ఇంకా అతుకులు పడ్డతాడు బిగుసుకునే ఉంది.

"సిట్టీపాపా... సిన్నీపాపా... జో... జో... పాపా...' ఆ...ఆ..." పాట గాలిలో నుండి ఇంకా అతనికి వినిసిస్తూనే ఉంది. ఈగలు ముసిరే ఆమె ఎండిన పెదవులు ఇంకా ఆ పాటనే పాడుతున్నట్లుగా ఉన్నాయి ..............................

* * *